

## శ్రీలంక దేశపు మార్కెట్లోకి పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : శ్రీలంక దేశపు మార్కెట్లోకి పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు ప్రవేశ పెట్టేందుకు ఆ దేశ ప్రజలు ఆసక్తి చూపుతున్నారని శ్రీలంక ప్రమోటింగ్ బయ్యర్స్ బృందం నాయకులు ఇర్ఫాన్ తెలిపారు. శ్రీలంక దేశ ప్రజలు చీరలు ధరిస్తారని పోచంపల్లి చేనేత వస్త్రాలు చూసి వారు ముచ్చటపడి దేశ వ్యాపార రంగంలోకి ఇక్కత్ చీరలతో పాటు చేనేత వస్త్రాలు తమ దేశంలో కొనుగోలు చేసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిందని అన్నారు. ఇటీవల జరిగిన ఆర్ బి ఎస్ సమ్మిట్ లో చేనేత వస్త్రాల విశిష్టతల గురించి తెలిపినప్పుడు ఆసక్తిని కనపరిచారని అన్నారు. బయ్యర్లు మార్కెటింగ్ చేసేందుకు పూర్తి అవగాహన కోసం తయారీ విధానాలను తెలుసుకోవడానికి చేనేత వస్త్రాలు తయారు చేసే క్లస్టర్ యూనిట్లను సందర్శించడానికి బయ్యర్స్ బృందం గురువారం సందర్శించినట్లు తెలిపారు. వినియోగదారులు వస్త్రాలపై విశ్వాసాన్ని నమ్మకాన్ని కలిగించేందుకు ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో చేనేత కళారూపాలు వస్త్రాలు తయారీ ముడిసరుకు నాణ్యత ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపు వంటి అంశాలను తెలుసుకునేందుకు బృందం పేర్కొన్నారు. శ్రీలంక మార్కెట్లో ఇప్పటివరకు పోచంపల్లి వస్త్రాలు లేవని ఎగుమతి చేయడానికి సరైన అవకాశం వచ్చిందని బయర్లు అక్కడ చేనేత వస్త్రాలను లాంచ్ చేయడానికి మొగ్గు చూపుతున్నారని చెప్పారు. తెలంగాణ ట్రేడ్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, జగదీష్ మార్కెటింగ్ సంయుక్తంగా చేనేత ఇక్కత్ వస్త్రాలను ఎగుమతి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు కర్నాటి బాలరాజు ప్రధాన కార్యదర్శి ఈ పూరి ముత్యాలు సంఘ సభ్యులు వారి వెంట ఉన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే సిపిఐని ఆదరించండి


### సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్



**ప్రజాపక్షం/చందూరు:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు ,ఉద్యమాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి అండగా నిలబడి విరాళాలు ఇచ్చి ఆదరించాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ప్రజలను కోరారు. గురువారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో మండల కార్యవర్గ సభ్యుడు సిహెచ్ ఊషయ్య అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో నల్పరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ చండూరు మండల , మున్సిపాలిటీలో ఉన్న ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తిప్పర్తి రాములు , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, జెల్ల శ్రీను, బండమీది వెంకన్న, గంట రమేష్ , ఇరిగి సంజీవ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం


### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గురువారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 444 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 38 లక్షల విలువైనముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఒక వరమని, ముఖ్యంగా వైద్య ఖర్చులు, అత్యవసర పరిస్థితుల్లో ఈ సహాయం ప్రజలకు గొప్ప ఊరటనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఇరాన్‌పై యుద్ధాన్ని నిలిపివేయాలి

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ




**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న క్రూరమైన దాడులు, యుద్ధాన్ని ఆపివేయాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాల పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీ మౌనం విడాలని డిమాండ్ చేశారు. దాడులపై స్పందించకుండా రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని అన్నారు. వలసవాద సామ్రాజ్యవాద దాడులను వ్యతిరేకిస్తున్నామని ధైర్యంగా చెప్పలేని మోడీ ప్రభుత్వానికి దేశ సార్వభౌమత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. యుద్ధం వల్ల ఆయిల్ సంక్షోభం పెరగడం మూలంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలంగా నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి , మల్లు నాగార్జున్ రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

### సమ్మెను అణచివేయడం కాదు..

# చర్చలతో పరిష్కారం కావాలి

### ఆర్టిజన్‌ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి-లేకపోతే ఉద్యమం ఉద్ధృతం

### ప్రభుత్వానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరిక





**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద టివిఏసి జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె రెండో రోజు సందర్భంగా ఆయన పాల్గొని ఆర్టిజన్స్ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా ఆర్టిజన్స్ సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు చర్చలకు పిలవకపోవడం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అని మండిపడ్డారు. 22 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆర్టిజన్స్‌ను ఇంకా తాత్కాలిక స్థితిలోనే ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గుర్తించిన కన్వర్షన్ అంశాన్ని అమలు చేయకుండా,పాతకాలపు స్టాండింగ్ ఆర్డర్స్ నిబంధనలను చూపిస్తూ ఆర్టిసన్స్‌కు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్హతల ఆధారంగా జూనియర్ లైన్‌మెన్,సబ్ ఇంజనీర్,జూనియర్ అసిస్టెంట్ వంటి పదవులకు కన్వర్షన్ చేయాలని స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వెంటనే కన్వర్షన్ చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెను అణచివేయాలని ప్రయత్నిస్తే పరిస్థితులు మరింత ఉద్రిక్తం అవుతాయి వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలి అని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లొడంగి శ్రావణ్ కుమార్,గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీర స్వామి, జేఏసీ జిల్లా చైర్మన్ జిట్టబోయిన లింగ స్వామి,జిల్లా నాయకులు గుండ లింగారెడ్డి, పెరిక శేఖర్,వేణుగోపాల్ రెడ్డి,పెరమళ్ళ మురళి, అద్దంకి వెంకన్న,లతీఫ్,విజయ్, ఉమాదేవి, నాగమణి, రమ్య, సతీష్, ప్రవీణ్, రమేష్, నరసింహ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నందం,బాసాని వెంకటయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరం.. ఏదైనా.. నెపం మాపైనే!!

### నేటికి చాలిచాలని వేతనాలు

### పండగ పబ్బాలకు సెలవులే ఉండవు!

### ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి అధ్వానం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : నేరం... ఏదైనా..నెపం మాపైనే..!! ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన. ఎంతటి ఒత్తిడినైన మౌనంగా భరిస్తూ విధులు నిర్వహిస్తున్నాం. పూర్తి చేస్తారు. స్వామి సన్నిధిలో మేమ అంటే అందరికి అలుసేనని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమలో తామే కుమిలిపోతున్నారు. విశ్వక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేయని తప్పులకు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతోనే దేవస్థానంలో ఏ ఘటన చోటు చేసుకున్న అధికారులు తమపై నెపం మోపుతూ నేరం నెట్టేస్తున్నారని ఆవేదన చెందుతున్నా రు. పండగ పబ్బాలకు కూడా సెలవుల్లేకుండా సేవలు చేస్తుంటే వివిధ కారణాలు చూపుతూ ఉద్యోగం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని వాపోతున్నారు. విధి నిర్వాహణలో తమకు ఎదురవుతోన్న సమస్యలను ఎవరితోనైనా పంచుకుంటే కుట్రలు చేస్తూ తొలగించేస్తున్నారు. దుకు కూడా జంకుతున్నారు. 2022 సంవత్సరం నుంచి సురక్ష ఏజెన్సీ అందుబాటులోకి వచ్చింది. దేవస్థానం పరిధిలోని 17 విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందే సేవలే కీలకమయ్యాయి. 2025 జూన్ 1 న ఉంచి ఆయా విభాగాల్లో 420 పైచిలుకు అనుమతి ఉంది. సు మారు గ్లోబల్ ఏజెన్సీ ద్వారా సుమారు 314 మంది. కృష్ణ కన్స్ట్రక్షన్స్ కింద 132 మంది పారిశుద్ధ్య (ఔటిసోర్సం (గ్) సిబ్బందికి విధులు నిర్వహిస్తున్నారు. కానీ, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సదుపాయాలు మాత్రం వీరి దరిచేరవు. అధికారుల దయాదాక్షిణ్యాల మీద వీరి జీతం, ఉద్యోగ జీవితం ఆధారపడి ఉంటుంది. ఇదే క్రమంలో దేవస్థానం పరిధిలో ఏ చోట ఏం జరిగిన వీరినే బాధ్యులను చేస్తూ అధికారులు వారి ఉద్యోగాలకే ఎసరు తెస్తున్నారు.

**సదుపాయాల కోత** : ఏజెన్సీ ద్వారా ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి వేతన చట్టం అమలు కావడం లేదు. అన్స్కిల్ రూ. 15,600, సెమీ స్కిల్ రూ.19,500, స్కిల్ రూ.22,750 మూడు విభాగాల ఓగా విభజించి ఈఎస్ఐ, పీఎఫ్తో కలిపి సిబ్బందికి వేతనాలు అందిస్తున్నారు. నెలకు మూడు, ఏడాదికి 15 సాధారణ సెలవులు, పండగ, ఇతర అవసరాలకు వేతనంతో కూడిన సెలవులు మంజూరి చేయాలి. ఒకవేళ సిబ్బంది మరణిస్తే ఈపీఎఫ్ కింద రూ. 15 లక్షల ఆర్థిక సహాయంతో పాటు కుటుంబ సభ్యుడులో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఇవి మాత్రం అమలు కావడం లేదు.

**ఔట్‌సోర్సింగ్ సిబ్బందే బలిపశువులు** : 2025 ఆగస్టు 28న చింతపండు దొంగతనం, సెప్టెంబరు 1న పుష్కరిణీలో రంగు మారిన నీళ్లు, లైట్లు వెలగనందుకు ఔట్సోర్సింగ్ సిబ్బందిపైనే క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. కాగా, చింతపండు దొంగతనంలో అధికారి, వంటస్వాములు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బలి చేసి పర్యవేక్షించాల్సిన అధికారులను వదిలేశారు. అధికారుల ప్రమేయ ఎంతోనే దొంగతనం చేసినట్లు బాధితులు బహిరంగం చేసినప్పటికి పక్షపాతంతో కమిటీ విచారణ చేసిందని ఆరోపణలు వెలువడ్డాయి. ఇఒ పర్యటనలో భాగంగా కొండకింద లక్ష్మీ పుష్కరిణీలో నీళ్లు రంగు మారగా ఆగ్రహించిన ఇఒ తక్షణమే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు వేశారు. కొండ చుట్టూ వలయ రహదారిలో గత ఏడాది అక్టోబరు 22న లైట్లు వెలగనందుకు నిర్వహణ బాధ్యతలు చూసే ఈసీఐఎల్ సంస్థను వదిలేసి ఇద్దరు ఔట్సోర్సింగ్ సిబ్బందిని బలి చేశారు.

వీరిని తిరిగి విధుల్లోకి చేర్చుకునేందుకు గడువు ఏమి లేకపోవడం చేత అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తూనే వారి వ్యక్తిగత పనులను చక్కాబెట్టాల్సి వస్తుంది. పైగా దేవస్థానంలో ఔట్సోర్సింగ్ సిబ్బందినే అధికారులు బలిపశువులను చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన తమను తగిన గుర్తింపుతో పాటు నిబంధనల ప్రకారం సదుపాయాలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.



## కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగేలా చూడాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండలంలోని ఎర్కారం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. వడ్ల మిల్లులను కూడా గుర్తించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రావచ్చని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలైన వెయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, త్రాగునీరు, టెంట్లు, వర్షాలు వస్తే అత్యవసర పరిస్థితుల్లో టార్పలిన్ పట్టాలు, ట్యాజింగ్ మిషన్లు, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. 2, 3 మండలాలకు కలిపి ఒక ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దీనిని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లా స్థాయిలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తారని అలాగే మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్‌బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

## నకిలీ కరెన్సీ మోసం.. విదేశీ నిందితుడు అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నకిలీ కరెన్సీ నోట్లతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న విదేశీ నిందితుడిని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.తిప్పర్తి మండల పరిధిలో జరిగిన ఈ ఘటనలో ఏ2 గోయిటా సొంగాలో (53), మాలి దేశానికి చెందిన వ్యక్తి కాగా, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రధాన ఏ1నిందితుడు సల్మాన్ ఉమా దాలియా పరారీలో ఉన్నాడు. పోలీసుల వివరాల ప్రకారం నిందితులు వాట్సాప్ ద్వారా పరిచయాలు పెంచుకుని,తక్కువ డబ్బుకు ఎక్కువ కరెన్సీ ఇస్తామని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్నారు. నల్లటి రంగు పూసిన కాగితాలను ప్రత్యేక రసాయనంతో కడిగితే అసలు నోట్లుగా మారుతాయని చూపించి బాధితులను మోసం చేస్తున్నారు.ఇటీవల మల్లేపల్లి వారిగూడెం వద్ద వంగూరి జానయ్య అనే వ్యక్తి నుంచి రూ.1లక్ష తీసుకుని,రూ.5లక్షల కట్టగా నమ్మబలికి నకిలీ కాగితాలు ఇచ్చినట్లు గుర్తించారు.బాధితుడు మోసపోయినట్లు తెలుసుకుని,తన స్నేహితుడి సహాయంతో నిందితుడిని మళ్లీ సంప్రదించి, తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించాడు.నిందితుడి వద్ద నుంచి నాలుగు కట్టల నకిలీ కాగితాలు, రసాయన ద్రావణం, ఒక మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై గతంలో మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో కూడా మోసం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన డిఎస్‌పి శివరాం రెడ్డి, సిఐ కొండల్ రెడ్డి,ఎస్ఐ వి. శంకర్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

### నిందితుడిపై పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 9 ఏండ్ల మైనర్ బాలకిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడకు చెందిన ఓ బాలికపై శాంతినగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అఘాయిత్యానికి పాల్పడగా బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు భయపడి పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఇంటికి వచ్చి కూతురిని వివరాలు అడగగా చిన్నారి ఏడుస్తూ జరిగిన విషయాన్ని వివరించింది. వెంటనే బాలిక తల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు యువకుడిపై ఫిర్యాదు చేయగా డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసుకోని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

## చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం

### వర్ధంతి సందర్భంగా పలువురు వక్తలు




**ప్రజాపక్షం/దేవరకొండ:** నిజాం నవాబ్ పునాదులను కదలించి, తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచి ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వర్‌రావు 32వ వర్ధంతి సందర్భంగా గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలకొండ కాంతయ్యతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, నాయకులు జ్యోతిబసు, వెంకటయ్య, మల్లేష్, గోవర్ధన్, ఆనందచారి, వెంకటయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోత్కూర్** : పేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన పోరాటయోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సిపిఐ భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చండ రాజేశ్వరరావు 33వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో సిపిఐ కార్యాలయం(కేఆర్) భవన్‌ల సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీతా పని వారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి మోత్కూరు మండలం అధ్యక్షులు గొలుసుల యాదగిరి, బీసీ సంఘం మండల కార్యదర్శి పెండ వెంకటేశ్వర్లు, తాడూరు లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : భారతదేశ పోరాటాల యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) 32వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం యాదగిరిగుట్టలోని సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై, సి.ఆర్. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు కోకల రవీందర్ పాల్గొన్నారు.

## నల్లగొండలో ఎల్‌పిజి గ్యాస్ విస్తరణ వేగవంతం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లాలో పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా విస్తరణ పనులను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.వాణిజ్య ఎల్‌పిజిపై ఆధారాన్ని తగ్గించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో గ్యాస్ పంపిణీ విస్తరణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్య సంక్షోభం ప్రభావంతో ఎల్‌పిజి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో పిఎన్‌జి విస్తరణ అవసరమని పేర్కొన్నారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా పనులు జరుగుతుండగా, వేగవంతం కోసం 24 గంటల పని అనుమతి ఇచ్చారు. శబ్ద కాలుష్య,భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ఈ అనుమతి సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఎల్‌పిజికు మారే వాణిజ్య వినియోగదారులకు మాత్రమే 50 వరకు ఎల్‌పిజి కేటాయింపు లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.ప్రాజెక్ట్ మేనేజర్ వంశీకృష్ణ ప్రకారం, వలిగొండ నుంచి నార్కట్‌పల్లి, అక్కడి నుంచి నల్లగొండ వరకు పైప్‌లైన్ పనులు కొనసాగుతూ,గ్రామాలకు గ్యాస్ సరఫరా ఏర్పాట్లు చేస్తున్నారు. సమీక్ష సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈసమీక్ష సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,ఎఎస్‌పి రమేష్, పౌరసరఫాల శాఖ అధికారి వెంకటేష్,జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్ ఆర్‌అండ్‌బి ఈఈ శ్రీధర్ రెడ్డి పంచాయతీరాజ్ అధికారి శేఖర్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర హాజరయ్యారు.

## పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి



### కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/యాదాద్రిక కలెక్టరేట్** : పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదులను, డార్మెటరీ హాల్ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రధానంగా నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. పాఠశాల లోని పరిసర ప్రాంతాలు పరిశీలిస్తూ పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు.పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

